రేపట్నుంచి రేషన్ కష్టాలు

- ఇప్పటి వరకు ఇంటివద్దే రేషన్ సరుకుల పంపిణీ
- తాజాగా ఎండీయూ వాహనాలు రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- జూన్ నుంచి డీలర్ షాపునకు వెళ్లాల్సిందే
- ఆందోళనలో రేషన్ కార్డుదారులు


ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్లవద్దనే సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు(ఫైల్)

జగ్గయ్యపేట: రేపటి నుంచి రేషన్‌కార్డుదారులకు ఇక్కట్లు తప్పేలా లేవు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేయగా, ఈ నెల వరకు అదే విధానం కొనసాగింది. అయితే ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం, జూన్ నెల నుంచి రేషన్‌షాపు డీలర్ల వద్దనే సరుకులు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీచేయడం ప్రజల పాలిట శాపంగా మారింది. ఆరేళ్లుగా ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దనే సరుకులు తీసుకోవడం ఎంతో సౌకర్యవంతంగా ఉండటంతోపాటు వ్యయప్రయాసలు తగ్గాయని పేదలు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ్లలో ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దనే ఇస్తుండటంతో కూలి పనులకు వెళ్లేందుకు సైతం ఇబ్బంది లేకుండా ఉండేదని, మళ్లీ రేషన్ షాపుల వద్దకు వెళ్లాలంటే ఒకరోజు సమయం వృథా అయినట్లేనని పేదలు ఆందోళన చెందుతున్నారు. కూలినాలి చేసుకునే బతికే తాము ప్రతినెలా రేషన్ సరుకుల కోసం ఓ రోజు ఉపాధి కోల్పోయినట్లేనని వాపోతున్నారు.

కార్డుదారులకు ఇబ్బందులే...

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రేషన్ షాపుల వద్ద వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చంటి బిడ్డల తల్లులు నిలబడి సరుకులు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. 2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా రేషన్ దుకాణాల వద్ద సరుకులు పంపిణీ చేయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల వద్దనే సరుకులు అనడంతో మళ్లీ పాత రోజులను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

పేటలో 53,219 రేషన్‌కార్డులు..

నియోజకవర్గంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతోపాటు పేట పట్టణంలో 130 రేషన్ దుకాణాలు ఉండగా 53,219 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం 49 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా ఇంటింటికీ రేషన్ సరుకులు అందించారు. అయితే కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆయా కార్డుదారులు సమీప రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

వికలాంగులకు సరుకులు అందేనా?..

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో నియోజకవర్గవ్యాప్తంగా 60 ఏళ్లకు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికీ రేషన్ అందుతుందా? లేదా? అనే ఆందోళన వారిని వేధిస్తోంది. నిన్న మొన్నటి వరకు ఇంటి వద్దకే వచ్చిన సరుకులు రేపటి నుంచి పరిస్థితేంటోనని వాపోతున్నారు. మాకు ఇచ్చే కమిషనే అరకొరగా ఉందని..ఇక వృద్ధులు, వికలాంగులైన కార్డుదారులకు ఇంటింటికీ వెళ్లి సరుకులు అందించాలంటే ఎలా అని డీలర్లు గుసగుసలాడుకుంటున్నారు.

ఆందోళనలో ఎండీయూ ఆపరేటర్లు..

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎండీయు వాహనాల ద్వారా రేషన్ సరుకులు ఇంటింటికీ అందించే ఆపరేటర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. ఒక వాహనంలో ఇద్దరికి ఉపాధి కలుగుతుండగా, ప్రభుత్వ నిర్ణయంతో ఉపాధి కోల్పోవాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్డుదారులు మాత్రం మళ్లీ రేషన్ కష్టాలు పడాల్సిందేనా? అని మండిపడుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఇంటివద్దనే సరుకులను అందజేయాలని రేషన్‌కార్డుదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

జిల్లా పరిషత్ నుంచి రూ.50 లక్షలు మంజూరు

జెడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి

కంచికచర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లోని అభివృద్ధి పనుల నిమిత్తం జిల్లా పరిషత్ నుంచి రూ.50లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి శుక్రవారం తెలిపారు. మండలంలోని చెవిటికల్లు ఎస్సీ కాలనీ(టవర్) వద్ద అంతర్గతరోడ్ల అభివృద్ధికి రూ. 8లక్షలు, మోగులూరు గ్రామానికి రూ.20లక్షలు,గొట్టుముక్కలకు రూ.15లక్షలు, కీసర గ్రామానికి రూ.7లక్షలు నిధులు మంజూరయ్యాయని వివరించారు. నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, సహకరించిన మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



కంచికచర్ల: స్థానిక ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి విజయకుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని డీలర్ల వద్ద జీలుగు, పిల్లిపెసర, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రెండురోజుల్లో పత్తి, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

కల్వర్టు ప్రారంభం

కొణకంచి(పెనుగంచిప్రోలు): మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మండలంలోని కొణకంచి గ్రామం వద్ద వాగుపై నిర్మించిన కల్వర్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇక్కట్లు గమనించి తక్షణం కల్వర్టు నిర్మాణాన్ని పూర్తిచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జగ్గయ్యపేట: విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీడీవో నితిన్ సూచించారు. యోగాంధ్ర ఉత్సవాలలో భాగంగా మండలంలోని ముక్త్యాల, గండ్రాయి, గౌరవరం, బలుసుపాడు గ్రామాల్లో శుక్రవారం యోగాపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ శ్వాసపై ధ్యాస ఉంచితే మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఖాళీ సమయంలో క్రీడలపై దృష్టి సారించాలన్నారు. గండ్రాయి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, సంక్రాంత్, సంధ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గ స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇద్దరు బధిరులకు శుక్రవారం వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తన నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో , తిరుమలగిరి గ్రామానికి చెందిన వెలగాల పూర్ణిమ, పేట పట్టణానికి చెందిన సామినేని శంకరరావులకు వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే తాతయ్య చేతులమీదుగా అందజేశారు. ఈ యంత్రాలను తీసుకురావడానికి కృషి చేసిన దివ్యాంగుల సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు



నందిగామరూరల్: ఉద్యోగ, కార్మికుల హక్కులను ప్రభుత్వాలు హరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు అన్యాయం చేసేలా కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తోందని మండిపడ్డారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సైదా, మాణిక్యం, బేబి, రాజారత్నం, సతీష్, నతానీలు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలపై సమర శంఖారావం

తన్నీరు నాగేశ్వరరావు


మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను సీఎం చంద్రబాబు తుంగలో తొక్కారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా హామీలను అమలుచేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను నూటికి నూరుశాతం అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలను కొనసాగిస్తామంటూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు మాట ఇచ్చి నేడు ఆమాట తప్పారన్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, రైతుభరోసా పథకాలు ఎక్కడా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ కూడలి, బలుసుపాడు సెంటర్, అప్సరా థియేటర్ రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినోత్సవ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. వెన్నుపోటు దినోత్సవ ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, సానుభూతిపరులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తన్నీరు కోరారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శి నాగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, న్యాయవాదులు సత్యశ్రీనివాసరావు, శివరాత్రి పృథ్వీ, నియోజకవర్గ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ మున్సిపల్, వలంటీర్ల విభాగాల అధ్యక్షులు అన్నెపాగ మురళి, ఇమ్రాన్ పాషా, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బండి రాజు, అనుమంచిపల్లి మాజీ సర్పంచ్ బెడదం సత్యనారాయణ, గండ్రాయి గ్రామ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, పట్టణ ఎస్సీసెల్ నాయకుడు ఉప్పెల్లి పెంటయ్య పాల్గొన్నారు.

కాజ్‌వే పనుల పరిశీలన


కాజ్‌వే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

లింగాల(వత్సవాయి): చిల్లకల్లు వైరా రహదారిపై లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వే మరమ్మతు పనులను శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. ఈసందర్భంగా పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కాజ్‌వే పై 980మీటర్ల మేర సుమారు నాలుగు అడుగుల మేర ఏడు అడుగుల వెడల్పుతో సిమెంట్ రహదారి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కాజ్‌వే మరమ్మతుల సమయంలో వాహనదారుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురాగా మరోవారం రోజుల్లో పనులను పూర్తిచేసి కాజ్‌వేను వినియోగంలోనికి తెస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ పరుశురాముడు, మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, తొండపు జగన్‌మోహన్‌రావు, చిట్టూరి రమేష్, నెల్లూరి శ్రీను, చావా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మక్కపేట(వత్సవాయి): ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త టి.జస్వంత్‌రెడ్డి సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జస్వంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు మూసపద్ధతిలోనే వ్యవసాయం చేయరాదన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం పుష్కలంగా ఉందని వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులకు తెలియజేసి వారి సూచనలను పాటించాలని కోరారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను కూడా సమానంగా అభివృద్ధి చేసుకుంటే ఆర్థిక సంవృద్ధిని సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయంలో మెలకువలు అనే బ్రోచర్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.రాజశేఖర్‌రెడ్డి, గోపాలస్వామి, పశువైద్యాధికారి శ్రీను నాయక్, ఉద్యానవన శాఖాధికారిణి టి.వర్ధినికుమారి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు


నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేటఅర్బన్: నాలి బార్ అసోసియేషన్ న్యాయవాది జాన్‌విక్టర్‌పై పోలీసుల చట్ట వ్యతిరేక చర్యలను ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు శ్యామల నర్సింహారెడ్డి, ఆంజనేయులు, రావూరి ప్రసాద్, కె.ప్రతాపరెడ్డి, అశోక్, నరేష్, చిన్న గాంధీ, అంకమరాజు, బిక్షమయ్య, రాజశేఖర్, రవి, ఉమా మహేశ్వరరావు, మన్నెం మురళి, గురువుల రాజు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామటౌన్: సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన తెనాలి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని నందిగామ న్యాయవాదులు డిమాండ్ చేశారు. తెనాలి పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు బార్ ఉపాధ్యాక్షుడు వరదబోయిన విజయ్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు ఉప్పులూరి డేవిడ్‌రాజు, దర్శి అర్జున్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, దాదా హుసేన్, పాల్ ప్రసాద్, వేల్పుల ప్రభాకర్ పాల్గొన్నారు.

మొబైల్ టెక్నాలజీ బస్సు సందర్శన

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఇన్ఫోసిస్ లిమిటెడ్(హైదరాబాద్) సంయుక్తంగా రూపొందించిన మొబైల్ టెక్నాలజీ ట్రైనింగ్ బస్సు ద్వారా జేఆర్‌సీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులకు శుక్రవారం శిక్షణనిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, వెబ్ టెక్నాలజీ అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ బస్సును ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సందర్శించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఆధునిక శిక్షణ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్‌ను పొందాలని సూచించారు. . కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, జేఆర్‌సీ విద్యా సంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, జేఆర్‌సీ కళాశాల ప్రిన్సిపాల్ జూటూరి వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ కేఎస్.రమేష్, అమ్మాణీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్, లైఫ్ స్కిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు, కళాశాల ప్రతినిధి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్


కాల్వలు శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది


కాల్వల్లో మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండలంలోని ముచ్చింతాల గ్రామంలో పంచాయతీ అధికారులు శుక్రవారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 'కాల్వలు ఇలా...మురుగు పారేదెలా' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. . సర్పంచ్ జక్కులూరి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలోని మురుగు కాల్వలు శుభ్రం చేయడంతోపాటు, కాల్వల్లో గుర్రపుడెక్క, కంపచెట్లను తొలగించారు.

ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీసీతా రామ స్వామి దేవాలయం(శ్రీధనశైల సీతా రామస్వామి పెద్ద రామాలయం) పునర్నిర్మాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అంకురార్పణ పూజలు చేశారు. కార్యక్రమంలో బలుసుపాడు గురుధాం వ్యవస్థాపకులు గెంటేల వెంకటరమణ దంపతులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కాగా ఈనెల 31వ తేదీ శనివారం ఉదయం అరణిమందనం, అగ్ని ప్రతిష్ఠ, చాయాదివాసం, సాయంత్రం ఆలయ వాస్తు శాంతి, జలాదివాసం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 8.06 నిమిషాలకు శ్రీఅహోబిల జియర్‌స్వామి వారి చేతులతో మహాకుంభ సంప్రోక్షణ ప్రాణప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో హరిదుర్గాప్రసాద్ తెలిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తుమ్మేపల్లి నరేంద్ర, ఆలయ చైర్మన్ తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, పేరూరి వెంకటేశ్వర్లు, భక్తబృందం పాల్గొన్నారు.

జగన్మాతకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన శ్రీ గాయత్రి నృత్య నికేతన్‌కు చెందిన 18 మంది చిన్నారులు పలు కీర్తనలకు ఆంధ్రనాట్యం ప్రదర్శన ఇచ్చారు. నృత్యాచారిణి యం. గాయత్రి పర్యవేక్షణలో గోరంట్ల నిహారిక, గహనాశ్రీవల్లిలతో పాటు పలువురు బృంద సభ్యులు ప్రదర్శించిన నాట్యం అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఆద్యంతం నాట్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ఎలక్ట్రానిక్ కాటాల తనిఖీ



నందిగామటౌన్: రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రేషన్ డీలర్ల ఎలక్ట్రానిక్ కాటాల ఈపోస్‌ను ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సులేమాన్ తెలిపారు. పట్టణంలోని ముక్కోటి మహామండపంలో డివిజన్‌లోని రేషన్ డీలర్ల కాటాల ఆన్‌లైన్ ప్రక్రియపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు చెందిన రేషన్ డీలర్‌ల కాటాలకు ఈపోస్ ఆన్‌లైన్‌తో పాటు సాంకేతిక లోపాలున్న కాటాలకు సర్వీసింగ్ చేస్తున్నట్లు చెప్పారు. సర్వీస్ టెక్నిషియన్ విజయ్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.